ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024





అసెంబ్లీ వాయిస్

వైద్యసౌకర్యాలు మెరుగుపరచండి

2.10లక్షల జనాభా కలిగిన గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వైద్యసౌకర్యాలు మెరుగుపరచాలి.గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామి ఆస్పత్రుల గురించి పట్టించుకోకుండా కాలం గడిపేశారు.ఇప్పటికీ ఏదైనా ప్రమాదం జరిగితే 50 కి.మీ దూరంలో ఉన్న చిత్తూరుకు వెళ్లాలి లేదంటే వేలూరు సీఎంసీకి వెళ్లాల్సిన పరిస్థితి వుంది.ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా నాలుగే పనిచేస్తున్నాయి. రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లే వున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలి.పెనుమూరులో, కార్వేటినగరంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్మాణాలను పూర్తి చేయించాలి.నియోజకవర్గానికి డయాలసిస్ సెంటర్,బస్సు డిపో మంజూరు చేయాలి.



- వీఎం థామస్, గంగాధరనెల్లూరు

చిత్తూరు అభివృద్ధికి నిధులివ్వండి

చిత్తూరును మున్సిపాలిటీ స్థాయి నుంచి పదేళ్లక్రితమే కార్పొరేషన్ స్థాయికి మార్చినా ఆ స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగలేదు.సీఎం చంద్రబాబు ప్రపంచదేశాలన్నీ చూసి ఎంతో ఆదర్శవంతంగా రాష్ట్ర రాజధాని అమరావతికి రూపకల్పన చేశారు. అదే స్ఫూర్తితో జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రత్యేక నిధులు కేటాయించాలి.



- జగన్మోహన్, చిత్తూరు

ప్రమాదాలపై దృష్టి పెట్టండి

పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జగమర్ల క్రాస్ నుంచి చిత్తూరు వరకు జరుగుతున్న ప్రమాదాల్లో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నా నేషనల్ హైవే అథారిటీ అధికారులు నివారణ చర్యలు తీసుకోవడం లేదు.అత్యవసర వైద్యం అందుబాటులో లేక పోవడంతో కూడా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. బంగారుపాళ్యం, పి.కొత్తకోట, పూతలపట్టుల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తే చాలామంది ప్రాణాలు కాపాడే అవకాశముంది.సీఎంసీ ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ వర్తింపజేయాలి.



- మురళీమోహన్, పూతలపట్టు

సూపర్ సిక్స్



వెదురుకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒకే ఈతలో ఓ మేక.. అర డజను పిల్లల్ని ఈనింది. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ గుర్రంవారికండ్రిగకు చెందిన బి.రామకృష్ణారెడ్డి ఇంట్లో ఉన్న మేక నాల్గవ ఈతలో సోమవారం ఆరు పిల్లల్ని ఈనింది. ఇందులో మూడు కొదం, మూడు పోతు పిల్లలున్నాయి. అన్నీ క్షేమంగా ఉన్నాయి.

గొప్ప తత్వవేత్త కనకదాసు



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు గొప్ప తత్వవేత్త అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కన్నడ భాషలో సామాన్యులకు అర్థమయ్యే రీతిలో కన్నడభాషలో రచనలు చేస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణభక్తుడు అయ్యాడన్నారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీఆర్వో మోహన్ కుమార్, డీఈవో వరలక్ష్మి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రబ్బానీ బాషా, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీపీవో పార్వతి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పద్మజ, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.



కుప్పంలో సాగవుతున్న మల్బరీ - పట్టుగూళ్ల మార్కెట్టుకు చేరిన నాణ్యమైన బైవోల్టీన్ పట్టుగూళ్లు

పట్టు సాధిస్తున్న కుప్పం!

- 10 రీలింగ్ యూనిట్లకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నాణ్యత పెరిగిన గూళ్లు
- ప్రతి నెలా 400 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి
- రీలింగ్ యూనిట్లు వస్తే రెట్టింపయ్యే అవకాశం

కుప్పం, ఆంధ్రజ్యోతి

పట్టుగూళ్ల ఉత్పత్తి, మార్కెటింగ్‌లో పట్టు సాధించే దిశగా కుప్పం డివిజన్ అడుగులు వేస్తోంది. పది రీలింగ్ యూనిట్లకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపండంతోపాటు, మల్బరీ సాగుకు, పట్టుగూళ్ల ఉత్పత్తి మరింత పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిమగ్నమయ్యారు.రీలింగ్ యూనిట్లు మంజూరైతే పట్టు ఉత్పత్తి పెరిగి అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశం పుష్కలంగా ఉంది.

కుప్పం వాతావరణం పట్టు ఉత్పత్తికి అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ తేమశాతం ఎక్కువ కావడంతోపాటు భూములు కూడా మల్బరీ సాగుకు అనువుగా ఉన్నాయి. కుప్పం డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 7 వేల ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. దాదాపు 400మంది రైతులు పట్టుగూళ్ల ఉత్పత్తిమీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరికి అనుబంధంగా మరో 500 మందిదాకా బతుకుతున్నారు. ప్రతి నెలా సుమారు 350 నుంచి 400 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో ముప్పావు వంతు నాణ్యమైన బైవోల్టీన్ గూళ్లే ఉంటున్నాయి. కుప్పంలోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో నెలవారీ సమారు 15-20 మెట్రిక్ టన్నుల పట్టుగూళ్ల విక్రయాలు జరుగుతున్నాయి. పట్టు పురుగులకు ఆహారంగా వేసే మల్బరీ ఆకు నాణ్యతపై పట్టుగూళ్ల నాణ్యత ఆధారపడుతుంది. గతంలో 3కు 3 అడుగుల కొలతతో మల్బరీ



రీలింగ్ యూనిట్‌నుంచి తీసిన పట్టు దారం

మొక్కలు నాటేవారు. అందువల్ల కలుపు తీయడం, ఇతర వ్యవసాయపరమైన పనులు చేయడం కష్టంగా ఉండి ఆకు నాణ్యత సరిగా ఉండేది కాదు. కానీ తర్వాత 6కు 2, 8కి 2 అడుగుల కొలతతో మొక్కల సాగు మొదలు పెట్టారు. దీంతో తోటలో చిన్నపాటి ట్రాక్టర్లు నడిచే వీలు కలిగి, అవసరమైన సాగు విధానాలు సరిగా అవలంబించడంతో ఆకు నాణ్యత పెరిగింది. దీంతో పట్టుగూడు బరువు కూడా 1.5 గ్రాముల నుంచి రెండు గ్రాములకు చేరింది. ఇప్పుడు ఒక కేజీకి సుమారుగా వెయ్యి పట్టుగూళ్లు తూగుతున్నాయి.

రీలింగ్ యూనిట్లకోసం ప్రతిపాదనలు

కుప్పం డివిజన్‌లో ఉత్పత్తి చేసిన పట్టుగూళ్లకు మార్కెటింగ్ సౌకర్యం సరిగా లేదు. దానికి కారణం డివిజన్ పరిధిలో పట్టుగూళ్ల నుంచి దారం తీసే రీలింగ్ యూనిట్లు లేకపోవడమే. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ఆర్‌కేఎం నగర్‌లో 8 చిన్న రీలింగ్ యూనిట్లు ఉన్నా అవి అసలు సరిపోవడంలేదు. కుప్పం పట్టుగూళ్ల మార్కెట్టులో గూళ్లు కొన్న వ్యాపారులు, వాటిని మదనపల్లె దాకా తీసుకు వెళ్లి, అక్కడ రీలింగ్ యూనిట్లలో పట్టుదారంగా మార్చుకోవాల్సిందే. ఇది కష్టనష్టాలతో, అధిక వ్యయంతో కూడుకున్న పని. అందువల్లన కుప్పం మార్కెట్టు అభివృద్ధి చెందడంలేదు. కుప్పం పట్టుపరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయ ఆవరణలో 600 యార్న్ సామర్థ్యం గల జపాన్ రీలింగ్ యూనిట్ వుంది కానీ, ప్రస్తుతం ఇది కేవలం 200 యార్న్ సామర్థ్యంతోనే పనిచేయగలుగుతోంది. దీన్ని కూడా పట్టు పరిశ్రమశాఖ ప్రైవేటు వ్యక్తికి లీజుకు ఇచ్చింది. దీంతో యోచించిన అధికారులు, రీలింగ్ యూనిట్లను డివిజన్ పరిధిలోనే ఏర్పాటు చేయించాలన్న నిర్ణయానికి వచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. సుమారు 10 మంది రైతులు రీలింగ్ యూనిట్లకోసం దరఖాస్తు చేసుకున్నారు. 500 నుంచి 600 యార్న్ సామర్థ్యం కలిగిన రీలింగ్ యూనిట్‌నుంచి, సుమారు 2 వేల యార్న్ సామర్థ్యం కలిగిన రీలింగ్ యూనిట్ దాకా ఇందులో ఉన్నాయి. వీటి స్థాపన వ్యయం రూ.1.5 లక్షలనుంచి, రూ.5 కోట్ల దాకా ఉంటుంది. రీలింగ్ యూనిట్ వ్యయంలో ప్రభుత్వంనుంచి 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. అయితే వీటికోసం దరఖాస్తు చేసుకున్న వారు, తమకు ఏకంగా 90 శాతం సబ్సిడీ ఇవ్వడంతోపాటు స్థలాన్ని కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు దరఖాస్తులైతే స్వీకరించి ప్రభుత్వానికి పంపారు కానీ, ఈ డిమాండ్ల విషయంలో ఫైలు ముందుకు కదలడంలేదు. ప్రభుత్వానికి, దరఖాస్తుదారులకు మధ్య సానుకూల వాతావరణంలో



పట్టు దారంగా మారేముందు పట్టుగూళ్లు

చర్యలు జరిగి, ఒక ఒప్పందానికి వస్తే రీలింగ్ యూనిట్ల స్థాపన సాకారమవుతుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సుముఖంగా ఉంది. అనుకున్నట్లుగా రీలింగ్ యూనిట్లు కుప్పం డివిజన్‌లో ఏర్పాటైతే ఆ మేరకు మల్బరీ సాగుతోపాటు పట్టుగూళ్ల ఉత్పత్తి, మార్కెటింగ్ కూడా స్థానికంగా బాగా పుంజుకుని పట్టురైతులకు మంచి లాభాలు లభించే అవకాశం పుష్కలంగా ఉంది.

ప్రోత్సాహకాలు అధికం

2024-25వ సంవత్సరంలో ఇప్పటిదాకా కుప్పం డివిజన్‌లో 20 షెడ్లను నిర్మించారు. 120 ఎకరాల మల్బరీ తోట పరిధిలో ఈ షెడ్ల నిర్మాణం సాగింది. చిన్న షెడ్ల నిర్మాణ వ్యయంలో రూ3 లక్షలు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. ఉపాధి హామీ పథకం కింద అనుసంధానమైన షెడ్లకు కూడా ఆ పథకం ద్వారా రూ.3 లక్షలు సబ్సిడీ లభిస్తుంది. ఇంతేకాక ఎకరా తోట పెంపకానికి రూ.26 వేలు యూనిట్ కాస్ట్ కాగా ఇందులో రూ.18,750 ప్రభుత్వంనుంచి సబ్సిడీగా లభిస్తుంది. మరోవైపు రీలింగ్ యూనిట్ల స్థాపనకు ఇప్పటికే 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఇలా పట్టు రైతులు ముందుకు రావాలే కానీ, ప్రభుత్వం తరఫున సబ్సిడీల రూపంలో పూర్తి ప్రోత్సాహం లభిస్తోంది. అంతేకాక పట్టుపురుగుల పెంపకానికి, తోట సాగుకు అవసరమైన యంత్రాలకు సంబంధించి కూడా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అతి త్వరలోనే ఆయా యంత్రాలు సైతం సబ్సిడీతో పట్టు రైతులకు పంపిణీ చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం అయ్యాయి.

మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం

ప్రతినెలా ప్రత్యేక దర్శనం తిరిగి ప్రారంభించాలని టీటీడీ నిర్ణయం ● వివరాలు వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి, తిరుమల స్థానికులకు గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ప్రత్యేకంగా దర్శనం అవకాశం ఉండేది. ఆ తర్వాత రద్దు చేసిన ఈ విధానాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాం' అని టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి తొలిసమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆ నిర్ణయాలివీ..

- తిరుపతిలో గరుడ వారధిని గతంలో సీఎం చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభించారు. దాని పేరును గత ప్రభుత్వం శ్రీనివాససేతుగా మార్చింది. ఈక్రమంలో తిరిగి పాతపేరు గరుడవారధిగానే ఉంచాలని బోర్డు తీర్మానించింది.
- గతంలో అలిపిరిలోని 20 ఎకరాలను టూరిజంకు కేటాయించారు. అక్కడ దేవలోకం అనే ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కానీ ఆ స్థలం కొన్ని చేతులు మారి ముంతాజ్ అనే ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్వామి కొండలకు దగ్గరగా ఉన్న ఆ ప్రాంతంలో హోటల్ నిర్మాణం జరిగితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి. అందుకని ఆ స్థలాన్ని టీటీడీకి అప్పగించాలని ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు.
- బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గతేడాది ఇచ్చిన బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించారు. దీంతో శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 బ్రహ్మోత్సవ బహుమానం అందనుంది.
- వివిధ రాష్ట్రాలకు ఇస్తున్న టూరిజం టికెట్లలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణలో కూడా తేలింది. ఈ క్రమంలో కోటా మొత్తాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల పిలిగ్రీం సెంటర్ అని, టూరిజం సెంటర్ కాదని పేర్కొన్నారు.
- విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టిక్కెట్ల కోటాను వంద నుంచి 200కు పెంచుతూ తీర్మానించారు.
- నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు తిరుమలలో రూ.90 లక్షలతో నూతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఓ ప్రశ్నకు చైర్మన్ బీఆర్ నాయుడు బదులిచ్చారు. తిరుమలలో అన్యమత ప్రచారం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- వీఐపీ బ్రేక్ దర్శనాల సమయాన్ని తగ్గించడం, సమయం మార్పు అంశంపైనా పరిశీలిస్తామన్నారు. ఆలిండియా రేడియోలో శ్రీవారి ఆర్జితసేవల ప్రసారాలను తిరిగి ప్రారంభించే విషయాన్ని అధికారులతో చర్చిస్తామన్నారు.
- ఏఐ టెక్నాలజీ ఉపయోగించి భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు కొన్ని సంస్థలతో మాట్లాడుతున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. రానున్న 25 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నప్రసాద భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దీని కోసం టీవీఎస్ అనే సంస్థ ముందుకు వచ్చినట్టు వెల్లడించారు. వడ్డించడం నుంచి పరిశుభ్రత, స్టోర్ వంటి అన్నింట్లో మార్పులు చేస్తామన్నారు.



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, సభ్యులు

భక్తులను దోపిడీ చేస్తున్న మఠాలపై చర్యలు తీసుకోండి : కిరణ్

తిరుమలలో భక్తులను దోపిడీ చేస్తున్న మఠాలపై చర్యలు తీసుకోవాలంటూ తిరుపతి జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమలలోని 60 శాతం మఠాలు వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లడంతో, వారు సిండికేట్‌గా మారి భక్తులను నిలువుదోపిడి చేస్తున్నారన్నారు. మఠాలను ఫైవ్‌స్టార్ హోటళ్లుగా మార్చి లక్షలాది రూపాయాలు దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో సామాన్య భక్తులు తిరుమలలో వివాహాలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కొందరు స్వామీజీల అక్రమ కట్టడాలనూ కూల్చేయాలని చైర్మన్‌ను కోరినట్టు తెలిపారు. టూరిజం పేరుతో శ్రీవారి దర్శనాల్లో అక్రమాలు జరుగుతున్నట్టు గతంలో కిరణ్‌రాయల్ వెలుగులోకి తీసుకొచ్చారు. ఈక్రమంలో టూరిజం టికెట్ల కోటాను రద్దు చేస్తూ తీర్మానించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

తమ్ముడు రామ్మూర్తికి తలుగు

నారావారిపల్లె నుంచి తిరుగు పయనమైన చంద్రబాబు

తిరుపతి/చంద్రగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ఆదివారం తన తమ్ముడు రామ్మూర్తి నాయుడి అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. సోమవారం స్వగృహంలో తలుగు పెట్టారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మరోసారి సోదరుడి చితి స్థలం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు స్వగ్రామం వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం సాయంత్రం లోకేశ్ సతీమణి బ్రాహ్మణి హైదరాబాదు వెళ్లగా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, దేవాన్ష్ మాత్రం గ్రామంలోనే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబును గ్రామంలోని సన్నిహిత బంధువులు, జిల్లా టీడీపీ నేతలు, అధికారులు కలిశారు. సోమవారం ఇంట్లో రామ్మూర్తి నాయుడికి తలుగు (బట్టలు, సాంబ్రాణి పెట్టి పూజించడం) పెట్టారు. అనంతరం సన్నిహిత బంధువులు వీరిని కలిశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, శాప్ చైర్మన్ రవి నాయుడు, తిరుపతి, చిత్తూరు టీడీపీ పార్లమెంటు కమిటీల అధ్యక్షులు నరసింహ యాదవ్, సీఆర్ రాజన్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే ఎస్వీపీ నాయుడు, పార్టీ నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, నరసింహ ప్రసాద్, పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్ తదితరులు చంద్రబాబు, లోకేశ్‌ను కలిశారు. నేతలతో కలిసి మధ్యాహ్నం చంద్రబాబు భోజనం చేశారు.



సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో ఎమ్మెల్యేల వీడ్కోలు

తమ్ముడికి నివాళులర్పించి..

మధ్యాహ్న భోజనానంతరం లోకేశ్ తనయుడు దేవాన్ష్ హైదరాబాదు బయల్దేరి వెళ్ళగా 3.20 గంటలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విజయవాడ బయల్దేరారు. మంత్రి లోకేశ్ తన కాన్వాయ్‌తో నేరుగా విమానాశ్రయం వెళ్లగా.. సీఎం చంద్రబాబు మాత్రం తమ మామిడి తోట వద్ద వాహనం ఆపించి కిందకు దిగారు. తోటలోకి వెళ్ళి తమ్ముడి దహన క్రియలు జరిగిన ప్రదేశం వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. అనంతరం వెనుదిరిగి విమానాశ్రయం బయల్దేరారు. సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచీ ప్రత్యేక విమానంలో మంత్రి లోకేశ్‌తో కలసి విజయవాడ బయల్దేరి వెళ్ళారు. వారికి కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, మాజీ మంత్రి అమరనాధరెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేత కొల్లూరు ఇందుశేఖర్ తదితరులు వీడ్కోలు పలికారు.

28న కర్మక్రియలు.. హాజరు కానున్న సీఎం

రామ్మూర్తినాయుడి కర్మక్రియలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉదయం వచ్చి కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం తిరిగి విజయవాడ వెళ్ళనున్నారు. కర్మక్రియల ఏర్పాట్లకు సంబంధించి ఆ రోజున భోజనాలు ఏర్పాటు చేయడానికి, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రామ్మూర్తినాయుడు కుటుంబీకులతో కలసి ఈనెల 28వ తేదీ వరకు నారావారిపల్లిలోనే ఉండనున్నారు.

శైవాలయాల్లో 'కార్తీక' సందడి



శ్రీకాళహస్తిలోని భరద్వాజతీర్థంలో కార్తీక దీపాల వెలుగులు.. దీపం వెలిగిస్తున్న ఈవో బాపిరెడ్డి

కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.





కపిలతీర్థంలో భక్తుల సందడి





నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం

పాపం.. పురుషుడు!

పెరుగుతున్న బలవన్మరణాలు



"అమ్మ తొమ్మిది నెలలు మోస్తే నాన్న పాతికేళ్లు.. రెండూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ..తన జీతమంతా ఇంటికే ఖర్చుపెట్టే నాన్న .. ఇద్దరి శ్రమ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు.."


ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన కవిత ఇది. చిన జీయర్ స్వామి సమక్షంలో రచయిత, సినీనటుడు ఈ కవిత చదువుతూ భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోయారు. అందరూ అమ్మ గురించో లేదా మహిళల కష్టం గురించో మాట్లాడుతారు. బండెడు సంసార భారం మోస్తూ ఏనాడూ తన ఆరోగ్యం గురించి పట్టించుకోని నాన్నను విస్మరిస్తారు. కారణం అతడు పురుషుడు. సంసారనావ ఈదుతూ ఎదురయ్యే ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లను మగవాళ్లు నిశ్శబ్దంగా భరిస్తున్నారు. ఒక్కోసారి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడుతుంటారు. సామాజిక, కుటుంబ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యలను పరిష్కారాలుగా ఎంచుకుంటున్నారని జిల్లా గణాంకాలు చెబుతున్నాయి.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

"పురుషుల మానసికారోగ్యం, ప్రాముఖ్యత గురించి చర్చ జరగాలనే ఆలోచనతో 'పాజిటివ్ మేల్ రోల్ మోడల్స్' అనే నినాదంతో నవంబరు 19ని ప్రపంచ పురుషుల దినోత్సవంగా గుర్తిస్తున్నారు. "

తిరుపతి జిల్లాలో పురుషుల ఆత్మహత్యల సంఖ్య మహిళలకంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రతి 10 ఆత్మహత్యల్లో ఏడు లేదా ఎనిమిది మంది పురుషులే ఉన్నారు. గతేడాది 339 మంది ఆత్మహత్యలకు పాల్పడితే వారిలో 272 మంది పురుషులు ఉన్నారు. ఈఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలు పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్న వారిలో మగవాళ్లు మహిళల కన్నా మూడు రెట్లు ఎక్కువ ఉన్నారు. గడిచిన 10 నెలల్లో 365 మంది ఆత్మహత్య చేసుకుంటే వీరిలో 283 మంది పురుషులే. ఆత్మహత్యకు భిన్నా కారణాలున్నా, ఒత్తిడికి గురవడం ప్రధానమని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కూడా కొందరు విషాదాంతమవుతున్నారు. ఒత్తిళ్ల తీవ్రత వల్లనే చాలామంది పురుషులు బీపీ, షుగర్ల బారిన పడుతున్నారు.

మద్యానికి బానిసలై



జిల్లాలో పది లక్షలమందికి పైగా పురుషులు ఉన్నారు. వీరిలో ప్రతి పదిమందిలో నలుగురు ఆల్కహాలును ఆశ్రయిసున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు కారణం ఒత్తిడి అని వీరు చెబుతుంటారు. జిల్లాలో నాలుగు డీ-అడిక్షన్ సెంటర్లు ఉన్నారు. ఇందులో ఒకటి రుయా ఆస్పత్రిలో నడుస్తోంది. మూడేళ్ల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో లక్ష్మీపురం వద్ద మరొకటి ఏర్పాటైంది. రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటి, పాపానాయుడు పేటలో మరొక డీ ఆడిక్షన్ సెంటర్ నడుస్తోంది. ఇక్కడ మద్యానికి బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

పురుషులే ఎందుకు?



శారీరకంగా పురుషుడు, స్త్రీకన్నా బలం కలిగినవాడు అనే వాదన వినిపిస్తుంటుంది. కార్మికుల వేతనాల్లోనూ ఈ తేడా చూపిస్తుంటారు. పిల్లల్ని కనే శక్తి ఉన్న స్త్రీలు సహజంగానే శారీరకంగా బలహీనం కావచ్చు గానీ, మానసికంగా మాత్రం పురుషులకన్నా బలమైనవారు. కుటుంబ, ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొనే స్థైర్యం మహిళల్లోనే ఎక్కువ. పిల్లలు, కుటుంబం అనే బాధ్యత కూడా వీరికి పోరాడే తెగువను ఇస్తుంది. మగవాళ్లు చావును ఎంచుకుని తేలిగ్గా ఈ బాధ్యత నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తారు. అందుకే అనారోగ్యంతోనే, అప్పులతోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ పురుషుల గురించే ఎక్కువగా వింటుంటాం.

పురుషులు బయటకు చెప్పుకోలేరు



రకరకాల ఒత్తిళ్ల వల్ల పురుషులు మానసికంగా అంతకంతకూ బలహీనులవుతున్నారు. అందుకే మహిళల కన్నా పురుషుల్లోనే ఆత్మహత్యలు మూడు రెట్లు ఎక్కువ కనిపిస్తున్నాయి. మానసిక బలహీనతలతో పాటు బీపీ, డయాబెటిస్, గుండె జబ్బులు తదితర ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. పురుషులు ఒత్తిడిని బయటకు చెప్పుకోలేరు. మనసులోనే దాచుకుని నలిగిపోతుంటారు. ఆడవాళ్లతో పోలిస్తే మగాళ్లకే గుండెపోటు ఎక్కువగా వస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఇండియన్ హార్ట్ సొసైటీ ప్రకారం..గుండెపోటు వచ్చిన 50 శాతం మగాళ్లలో 50 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లే ఉన్నారు. విదేశీయులతో పోల్చితే మన దేశంలో ఉన్న మగాళ్లే రెండు రెట్లు ఎక్కువగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్నారు.

- అనుపమ, క్లినికల్ సైకాలజిస్టు

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 168 వినతులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 168 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 109 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛను కోసం 8 నెలలుగా తిరుగుతున్నా..



'కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తొలగించారు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నా. పింఛను కోసం ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా పట్టించుకోండి' అంటూ రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన శంకరయ్య అధికారులకు విన్నవించారు.

నిమ్మచెట్లు నరికేశారు



అయ్యా నేను, నా భార్య దివ్యాంగులం. నాకు బాలయ్యపల్లి మండలం అష్టకావేరి గ్రామంలో ఎకరా భూమి ఉంది. 25ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. గ్రామానికి చెందిన వీరయ్య నా పొలాన్ని నాలుగు నెలల క్రితం ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే పొలంలో ఉన్న నిమ్మచెట్లను సదరు వ్యక్తులు నరికేశారు. న్యాయం చేయాలని వెంకటరమణయ్య అధికారులకు విన్నవించారు.

నష్ట పరిహారం ఇవ్వండి

గాలేరు - నగరి సుజల స్రవంతి పథకం కోసం ఏర్పేడు వద్ద ఉన్న మా భూమిని అధికారులు తీసుకున్నారు. పరిహారం కోసం మూడేళ్లుగా జీఎన్ఎస్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెల్లించడంలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అదే పరిస్థితి. న్యాయం చేయాలని తిరుపతికి చెందిన మొబీనాబేగం అధికారులకు విన్నవించారు.

జీవో అమలు చేయాలని ఆందోళన

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో కుదుర్చుకున్న జీవోను తక్షణం అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై చర్చలు జరిపి జీవో విడుదలై తొమ్మిది నెలలు కావస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఉద్యోగ విరమణ చెందిన వారికి బెనిఫిట్ స్కీమ్ కింద తక్షణమే రూ.60వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.





వేతనం పెంచాలని ధర్నా

కనీస వేతనాలు పెంచాలని కోరుతూ సివిల్ సప్లైస్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సంఘీభావం ప్రకటించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. ప్రతినెలా ఐదో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యదర్శి రవి, హమాలీ యూనియన్ నాయకులు చెంచయ్య, శీను, పాండు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం





ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం - ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బియ్యం లారీ ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని వీఎంపల్లి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి(37) ఎరువుల కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఎరువుల దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ కార్యకలాపాలు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. కాసాగార్డెన్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి వెంకటగిరికి బయలుదేరాడు. వీఎంపల్లి వద్ద జాతీయ రహదారి మెయిన్‌రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న బియ్యంలోడ్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా 90 రోజుల సుదీర్ఘకాలం ప్రసాద్‌రెడ్డి అయ్యప్పదీక్షలో ఉన్నాడు.

రేణిగుంటలో నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లు, రెండు మెడికల్ షాపుల సీజ్



సాయినారాయణ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లను, రెండు మెడికల్ షాపులను జిల్లా వైద్యాధికారి శ్రీహరి సీజ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వీబీఆర్ నర్సింగ్ కళాశాలలో కలుషిత ఆహారం తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని జిల్లా వైద్యాధికారి శ్రీహరి పరీక్షించారు. ఈ సందర్భంగా వీబీఆర్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రేణిగుంట పట్టణంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదు రావడంతో ఆయన వాటని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి నారాయణ, కార్తికేయ, శ్రీపద్మావతి వెంకటేశ్వర, రూప క్లినిక్‌లను, సాయి నారాయణ, శ్రీపద్మావతి వెంకటేశ్వర క్లినిక్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్‌లను సీజ్ చేశారు. మండలంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేయాలని వైద్యాధికారి చైత్ర ప్రకాష్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.

పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో సూళ్లూరుపేట మండలం పేర్నాడు రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వడం లేదని ప్రభుత్వం కల్పించుకొని అనుమతులు ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వేనాడు-పేర్నాడు రోడ్డు సమస్యను ఆమె ప్రస్తావించారు. మూడు పంచాయతీల పరిధిలో 18 గ్రామాలు ఉన్నాయని సుమారు 5వేల మంది ఆయా గ్రామాల్లో జీవిస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సరైన రోడ్డు వసతిని ఆ గ్రామాల్లో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. సరస్సు కోసం వచ్చే వలస పక్షులు ఎంత ముఖ్యమో ఆయా గ్రామాల ప్రజలు కూడా అంతే ముఖ్యమని తెలియజేశారు. ఆ మేరకు ఆ రోడ్డు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్న అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు.

జగన్‌పై అసభ్యకరపోస్టులు పెట్టారు

● తిరుపతి పోలీసులకు భూమన, రోజా, నారాయణస్వామి ఫిర్యాదు



తిరుపతి ఈస్ట్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతూ తమ నాయకుడు వైఎస్ జగన్‌పై అసభ్యరక పోస్టులు పెడుతున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరసింహులు ఫిర్యాదును పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారికి చెప్పారు. వైసీపీ నాయకులు కోరినట్లుగా ఫిర్యాదుకు రసీదు ఇచ్చారు. వైసీపీని భ్రష్టు పట్టించాలనే ఆలోచనతోనే తప్పుడు పోస్టులు పెడుతున్నారని భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతీసేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులపై ప్రివిలేజ్ మోషన్: ఎంపీ

ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడానికి పోలీసులు ఆసక్తి చూపలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. దాదాపు 40 నిమిషాలపాటు పట్టించుకోలేదన్నారు. ప్రొటోకాల్ పాటించని పోలీసులపై ప్రివిలేజ్‌మోషన్ మూవ్ చేయాల్సి వుంటుందని హెచ్చరించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

● జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి



సమావేశంలో పాల్గొన్న జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులతో ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యావంతులు మహిళల భద్రత పట్ల శ్రద్ధ చూపాలని, మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి స్పష్టం చేశారు. తిరుపతి ఐఐటీలో నీతి బోధ్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీం సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళల భద్రత పెంపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఇలాంటి కీలకమైన కార్యక్రమాన్ని నిర్వహించడంలో నీతిబోధ్ క్లబ్, ఎన్ఎస్ఎస్ టీంల సమష్టి కృషి ఉందన్నారు. మహిళల హక్కులు, ఆహార భద్రత, పౌష్టికాహారంపై విజయభారతి సయాని పలు సూచనలు చేశారు. మహిళల శ్రేయస్సు, సాధికారతకు ఆచరించాల్సిన విధి విధానాలపై ప్రసంగించారు. ఐఐటీలో విశిష్ట ఉపన్యాస కార్యక్రమం సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా నిర్వహించడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులకు ఐఐటీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రచందనం వాహన డ్రైవరు అరెస్టు

● టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద పది నెలల కిందట టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు.. ఎర్రచందనం స్మగ్లింగ్ వాహన డ్రైవర్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 23న తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు వాహనాలను తనిఖీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం తీసుకుని వస్తున్న కారును కానిస్టేబుళ్లు ఆపారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన వసంత్ ఎర్రచందనం వాహనం ఆపకుండా వేగంగా వచ్చి కానిస్టేబుల్ ప్రభాకరరావును ఢీకొట్టి పరారయ్యాడు. దీనిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన వసంత్ కోసం గాలించిన పోలీసులు.. సోమవారం అరెస్టు చేశారు. అతడిని విచారించి ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ ఎవరనే విషయాలు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఏర్పేడు సీఐ జయచంద్ర చెప్పారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయానికి ముందే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రెండవ గేటు సమీపంలో భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా విశేషంగా దీపారాధన సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. రూ.50 శీఘ్ర దర్శనం 3,328, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,102 కలిపి మొత్తం 6,430 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులుపేర్కొన్నారు. మొత్తంగా 35వేలమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

వన్యప్రాణుల దాడులతో పంటలు ధ్వంసం


సోమల సమీపంలో అడవి పందులు తొక్కేసిన వరి పొలం

సోమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు పంట పొలాలపై స్వైర విహారం చేస్తూ తొక్కేస్తున్నాయి. ఆదివారం రాత్రి సోమల సమీపంలోని శెట్టివారి మోహన్, సురేంద్ర, నాగరాజ, సుధాకర్ వరి పొలాల్లో అడవి పందులు స్వైరవిహారం చేశాయి. అలాగే టమోటా తోటల్లో తిరగాడి పచ్చికాయలనే తినేయడంతో తీవ్రంగా నష్ట పోతున్నామని రైతులు వాపోతున్నారు. అడవి పందులకు తోడు దుప్పులు, నెమళ్ల విచ్చల విడిగా పంటలపై పడి నష్టపరుస్తున్నాయి. రైతులు పొలాల వద్దనే రాత్రి జాగరణ చేస్తూ కాపుగాస్తున్నా ఏదో సమయంలో పంటలపై విరుచుకు పడుతున్నాయి.

ఆర్టీసీ బస్సులో గొలుసు చోరీ


బాధితురాలు సరస్వతమ్మ

చౌడేపల్లె, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మహిళ బంగారు చైన్ చోరీకి గురైన ఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు ... బంగారుపాళ్యంకు చెందిన విశ్రాంత ఉద్యోగి సరస్వతమ్మ పుంగనూరులో ఉంటున్నారు. సోముల పండుగ కోసం సదుంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్ళడానికి 22 గ్రాముల బంగారు చైను బ్యాగులో పెట్టుకుని బయలుదేరింది. అలాగే ఖర్చుల కోసం రూ.4000 నగదు కూడా ఉంచుకుంది. పుంగనూరులో తిరుపతి వెళ్లే బస్సు ఎక్కింది. ఓ మహిళ ఆమె పక్క సీటులోనే కుర్చుని సదుం వెళ్లేందుకు టికెట్టు తీసుకుంది. అయితే ఆమె చౌడేపల్లెలోనే దిగేసింది. చౌడేపల్లె దాటగానే సరస్వతమ్మ తన బ్యాగు జిప్పు తీసి ఉన్నట్లు గమనించింది.వెతకగా అందులో ఉన్న బంగారు చైను, నగదు కనిపించలేదు.చౌడేపల్లెలోనే ఆమె కూడా బస్సు దిగేసి, బంధువుల సాయంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి బస్టాండులో గాలించారు. అనుమానితురాలు పలమనేరు రోడ్డువైపు వెళ్ళినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తెలిపారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తపై టీడీపీ నేతల ఫిర్యాదు


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ప్రముఖ రాజకీయ నాయకులపై దుష్ప్రచారం చేస్తూ వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వైసీపీ కార్యకర్త పాలేటి రాజ్‌కుమార్‌పై టీడీపీ నేతలు సోమవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్ చేయడం, వారిని అసభ్య వ్యాఖ్యలతో దూషించడం, సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం వంటి వాటికి పాల్పడినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో.. చిత్తూరు నియోజకవర్గ ముస్లిం మైనార్టీ టీడీపీ అధ్యక్షుడు జాఫర్, నేతలు విజయ్‌కుమార్, మోహన్‌రాజ్, న్యాయవాది శ్రీనివాస్ బాబు, గోపాల్ తదితరులు ఉన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాల్లో పురోగతేదీ?

- అధికారులపై కలెక్టర్ అసహనం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'పాడి పశువుల పెంపకం కోసం గోకులం షెడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అధికారులు మాత్రం బిల్లులు అప్‌లోడ్ చేయడంలో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలునుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 2,327 గోకులం షెడ్లు మంజూరు చేయగా.. రూ.50.99 కోట్లతో 2,173 పనులకు సాంకేతిక మంజూర్లు చేశామన్నారు. ఇప్పటివరకు 980 యూనిట్లు గ్రౌండింగ్ కావడం, 32 షెడ్ల నిర్మాణం మాత్రమే పూర్తిచేయడం శోచనీయం అన్నారు. 1,807 పనులకు మాత్రమే బిల్లులు అప్‌లోడ్ చేశారని అన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారిణి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బిడ్డకు బ్లడ్ క్యాన్సర్

- ఆదుకోవాలని తహసీల్దార్‌కు తండ్రి విజ్ఞప్తి


చికిత్స పొందుతున్న అక్షిత్

గుడిపాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన బిడ్డ అక్షిత్(3)కు బ్లడ్ క్యాన్సర్ వచ్చిందని.. ఆదుకోవాలని గుడిపాల మండలంలోని వసంతాపురం పంచాయతీ పశుమంద దళితవాడకు చెందిన అగస్టీన్ విన్నవించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు నెలలుగా తన బిడ్డ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడన్నారు. కూలీ పనులకు వెళ్తే తప్ప తన కుటుంబం గడవదని, ప్రస్తుతం తన బిడ్డ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నాడన్నారు. వైద్యానికి రూ.4లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారని చెప్పాడు. ప్రభుత్వం నుంచి తనకు సహాయం అందించాలని కోరారు.

26లోపు టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుర్తింపు పొందిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసే రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులు ఈనెల 26వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వరలక్ష్మి పేర్కొన్నారు. అపరాధ రుసుం.. రూ.50తో డిసెంబరు 2లోపు, రూ.200తో 9లోపు, రూ.500తో డిసెంబరు 16వ తేదీలోపు చెల్లించవచ్చునన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉన్నవారు రూ.125, మూడు సబ్జెక్టుల కంటే తక్కువ ఉన్నవారు రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతోపాటు రూ.60, అండర్ ఏజ్ విద్యార్థుల ఫీజు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైన విద్యార్థులు రూ.80 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని హెచ్ఎంలకు సూచించారు.

సత్యాత్మతీర్థ స్వామికి తిరుమలలో పెద్దమర్యాద


అఖిలాండం వద్ద సత్యాత్మతీర్థ స్వామికి శఠగోపంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామి సోమవారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపాన్ని అందించి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. శిష్యబృందంతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు.

మామిడి తెగుళ్లపై నేడు అవగాహన కార్యక్రమం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మామిడిలో తెగుళ్లపై మంగళవారం హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో రీజనల్ స్థాయి అవగాహన కార్యక్రమం ఉంటుందని ఉద్యానాధికారి మదుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మామిడి రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

బడి సమయాల్లో

భారీ వాహనాలు అనుమతించొద్దు

- కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 190 అర్జీలు


విద్యార్థినుల సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బడికి వెళ్లి, వచ్చే సమయాల్లో భారీ వాహనాలను చిత్తూరు నగరంలోకి అనుమతించవద్దని నారాయణ విద్యాసంస్థల విద్యార్థినులు తావ, ఇఫ్రానియ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చి అర్జీ అందజేశారు. తాము రాకపోకలు సాగించే సమయాల్లో ఇసుక ట్రాక్టర్లు, నీళ్ల ట్యాంకర్లు, లారీలు వస్తున్నాయని చెప్పారు. వీటివల్ల సైకిళ్లు, ద్విచక్రవాహనాల్లో వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు స్వీకరించారు. మొత్తం 190 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 161, పోలీసుశాఖకు 4, డీసీహెచ్ఎస్, పంచాయతీరాజ్, ఆర్టీసీ, ఎస్సీ కార్పొరేషన్, డీఎఫ్‌వో, గృహ నిర్మాణ సంస్థ, డీఆర్‌డీఏ తదితర శాఖలకు కలిపి 25 చొప్పున ఉన్నాయి.

ఆశాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి



తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, నేతలు అనురాధ, సుబ్బలక్ష్మి, వనజాక్షి, సావిత్రి, సురేఖ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా,

పొలాలకు దారి సౌకర్యం కల్పించండి



ఎక్స్‌ప్రెస్ హైవే కారణంగా వ్యవసాయ పొలాలకు దారి లేకుండా పోయిందని పలమనేరు మండలం కొలమాసనపల్లెతోపాటు మరో మూడు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దారి సౌకర్యం కల్పించాలని కోరారు.

అంధుల శరణాలయంలో సౌకర్యాల కరువు



తిరుపతిలోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ 50 మంది వసతి పొందుతున్నారన్నారు. కిటికీలు, తలుపులు తుప్పు పట్టాయని, తాగునీటి బోరు ఎండిపోయిందన్నారు. సమస్యలను వికలాంగులశాఖ ఏడీ శ్రీనివాస్‌ను కోరుతున్నా పట్టించుకోవడం ఆరోపించారు. ఇప్పటికి ఆరుసార్లు చిత్తూరుకు వచ్చామని, తమ సమస్యలను పరిష్కారం కావడం లేదన్నారు.

108 ఉద్యోగుల రిలే దీక్ష



తమ సమస్యలను పరిష్కరించాలంటూ 108 ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. అంబులెన్స్‌లను నేరుగా ప్రభుత్వమే నిర్వాహించాలని డిమాండ్‌చేశారు. పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.

మరికొన్ని సమస్యలిలా..

- చిత్తూరు నగరం మెసానికల్ మైదానం రోడ్డులో ఇసుక ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలను అనుమతించకూడదని బీజేపీ నేతలు రామభద్ర, ఇతర నేతలు కోరారు. రెండ్రోజుల కిందట ఓ ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఏడేళ్ల బాలుడు అక్కడికక్కడే చనిపోయాడని గుర్తుచేశారు. రోడ్డును వెడల్పు చేయడంతోపాటు వాహనాల వేగాన్ని నిరోధించాలని కోరారు.
- రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరిగిపోయిన తన భర్త అనిల్‌కుమార్‌కు పింఛన్, రేషన్‌కార్డును మంజూరు చేయాలని చిత్తూరు మండలం తుమ్మిందపాళ్యంకు చెందిన వెన్నల కోరారు.
- బండిబాటను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని తనకు దారి సౌకర్యాన్ని కల్పించాలని పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన ఇరగమ్మ కోరారు.
- తన భూమిని సర్వేచేసి ఇవ్వాలని పూతలపట్టు మండలం వావిల్‌తోటకు చెందిన చక్రపాణి కోరారు.

పోలీసు కార్యాలయానికి 37 అర్జీలు


అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో పీజీఆర్ఎస్‌ను ఎస్పీ మణికంఠ సోమవారం నిర్వహించారు. మొత్తం 37 అర్జీలు అందాయన్నారు. బాధితుల నుంచి అర్జీలను ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్‌లతో కలిసి ఎస్పీ స్వీకరించారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. భూ తగాదాలపై 16, కుటుంబ తగాదాలపై 8, డబ్బు తగాదాలపై 4, ఆస్తి తగాదాలపై 3, చీటింగ్, వేధింపులు, ఇంటి తగాదాలపై 2 చొప్పున అర్జీలు అందాయి.

సీఎం ఇంటి ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

చంద్రగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లిలోని సీఎం చంద్రబాబు ఇంటి ఎదుట తిరుపతికి చెందిన మహిళ ఒకరు ఆత్మహత్యకు యత్నించడం కలకలం సృష్టించింది. సోమవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబును కలిసేందుకు తిరుపతి పద్మావతి వర్శిటీ సమీపంలోని గాంధీనగర్ నుంచీ నారావారిపల్లి వచ్చిన యశోద అనే మహిళ చాలాసేపు సీఎం నివాసం ఎదుట నిరీక్షించారు. పోలీసులు అనుమతించకపోవడంతో చివరికి బలవంతంగా లోపలికి వెళ్ళేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో


నారావారిపల్లిలో మంత్రి లోకేశ్‌తో టీడీపీ నేతలు


మహిళ నోట్లో నుంచి గాజులు తీస్తున్న పోలీసులు

ఆమె చేతికున్న గాజులు పగులగొట్టుకుని ఆ ముక్కలు, పొడి మింగి ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు అడ్డుకుని ఆమెను అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు.ఈ ఘటనను ఫొటోలు, వీడియోలు తీయడానికి యత్నించిన మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి విలేకరి నుంచీ మొబైల్ ఫోన్ గుంజుకున్నారు.

డీఎల్డీవోలకు పోస్టింగులు


విద్యారమ

చిత్తూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో డీఎల్డీవోలుగా పనిచేస్తున్న వారితో పాటు పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న వారికి పోస్టింగులు ఇస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఆదిశేషారెడ్డిని కడప డ్వామా పీడీగా , శ్రీకాళహస్తి ఈటీసీ ఇన్‌స్ట్రక్టర్ విద్యారమను నెల్లూరు జడ్పీ సీఈవోగా, అక్కడ పనిచేస్తున్న ఖాదర్ బాషాను నగరి డీఎల్డీవోగా నియమించారు. అన్నమయ్య జిల్లా ఏపీవో సుధాకరరావును చిత్తూరు డీపీవోగా, అల్లూరి సీతారామరాజు జిల్లా డ్వామా పీడీ శివయ్యను చిత్తూరు డ్వామా పీడీగా, చిత్తూరు డ్వామా ఎఫ్ఎం చిన్నరెడ్డెప్పను చంద్రగిరి ఏపీడీగా నియమించారు.

మెప్మా పీడీగా రవీంద్ర

చిత్తూరు సెంట్రల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మెప్మా పీడీగా నెల్లూరు జిల్లాలో పీడీగా పనిచేస్తున్న డి.రవీంద్రను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న రాధమ్మ.. నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హుసేన్



సదుం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సదుం తహసీల్దార్ హుసేన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సోమవారం మండల రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు.

ఖేల్‌ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత ధ్యాన్‌చంద్, ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్యలతో పాటు రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులను ప్రకటించారని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9542034270ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు: ఎస్ఈ

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సదరన్ డిస్కం ఎస్ఈ ఎ.శ్రీనివాస బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ చౌర్యం జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి సర్వీసుల రూపంలో కనెక్షన్ తీసుకుని ఇతర సేవలకు వినియోగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. సర్వీసు తీసుకునే సమయంలో అంగీకరించిన నిబంధనలు ఉల్లంఘించరాదని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం




కార్తీక దీపాలతో భక్తులు - ప్రసంగిస్తున్న సిద్ధేశ్వరానందభారతి

తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో సోమవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి మాట్లాడుతూ.. కార్తీక మాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అధిక ఫలం పొందవచ్చున్నారు. మనలోని అంధకారాన్ని దీపం పోగొడుతుందన్నారు. శివకేశవుల వైశిష్యం, దీపం ప్రాముఖ్యత, దీపారాధనతో కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ప్రజల హృదయాలలో జ్ఞానజ్యోతులు వెలిగించాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వేద పండితులు యతి వందనం, వేదస్వస్తి నిర్వహించారు. వివిధ పూజల అనంతరం ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నృత్యరూపకం ప్రదర్శించారు. చివరగా అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు అన్నమయ్య గీతాలను ఆలపించారు. టీటీడీ ఈవో జె.శ్యామల రావు, వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి, బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, డీఎల్వో వరప్రసాదరావు, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, అర్చక బృందం, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

కపిలతీర్థంలో ముగిసిన చండీయాగం



చండీ యాగం నిర్వహిస్తున్న వేద పండితులు -దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కపిలతీర్థంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న చండీయాగం సోమవారం ముగిసింది. చివరి రోజు యాగశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు చండీహోమం సమాప్తి, పూర్ణాహుతి కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు కపిలేశ్వరస్వామి కలశస్థాపన, పూజ, జపం, హోమం, నివేదన, హారతి నిర్వహించారు. డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు పాల్గొన్నారు. సోమవారం కావడంతో భక్తుల రద్దీకి తగ్గట్టుగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది.

నేటి నుంచి రుద్రయాగం

కపిలతీర్థంలోని శివాలయంలో మంగళవారం నుంచి 29వ తేదీ వరకు రుద్రయాగం నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.500 చెల్లించి ఒకరోజు హోమంలో పాల్గొనవచ్చు. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం అందజేస్తారు.

బదిలీ చేసినా రిలీవ్ కాలేదు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్(ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో నూతనంగా ఏర్పడిన చిత్తూరు, అన్నమయ్య జిల్లా కేంద్ర సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు గడువు ముగిసినా రిలీవ్‌కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతన జిల్లాల వారీగా విద్యుత్ సర్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేసి, గతనెల 22వ తేదీ ఉద్యోగుల బదిలీలు ప్రారంభించారు. ఈనెల 15వ తేదీలోపు బదిలీ చేసిన ఉద్యోగులు రిలీవ్ కావాలని ఆదేశించారు. అయినప్పటికీ ఏఈ నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న జేఎల్ఎం వరకు కొందరు ఉద్యోగులు రిలీవ్ కాలేదు. జిల్లా స్థాయి అధికారి అండదండలతో వారు ఇక్కడే ఉండే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

అపార్టుమెంటులో అగ్నిప్రమాదం

రూ.8 లక్షల ఆస్తి నష్టం


అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన వస్తువులు

తిరుపతి,(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలోని ఒక అపార్టుమెంటులో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. బాలాజీ కాలనీలోని మేఘన అపార్టుమెంటులో బసివిరెడ్డి కాపురముంటున్నారు. కుటుంబ సమేతంగా ఆయన బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి పొగ వస్తుండడంతో అపార్టుమెంటులో కాపురమున్న వారు గుర్తించి వెంటనే స్థానిక అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏసీ, డబుల్‌కాట్ బెడ్, వుడ్ ర్యాక్‌లు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వచ్చినట్లు బసివిరెడ్డి తెలిపారు.

ఆదర్శ రచనలతో మంచి సమాజం



కవులను సన్మానిస్తున్న గ్రంథాలయాధికారులు

పుంగనూరు రూరల్, నవంబరు18: యువతకు ఆదర్శంగా ఉన్న రచనలు రచించడం వల్ల మంచి సమాజం ఏర్పడుతుందని విశ్రాంత హెచ్ఎం వెంకటపతి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజల్లో కదలికలు తీసుకురావడంతో రచయితలు, కవుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీతాపతిరాజు, గంగులమ్మ, గ్రంథాలయాధికారి తులసీనాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, శ్రీనివాసులు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'అపార్' కష్టాలపై ఫిర్యాదుల వెల్లువ

సోమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అపార్' కష్టాలపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేశారు. పలు గ్రామాల విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి సోమల సచివాలయం వద్ద అపార్ నమోదుకోసం పడిగాపులు కాస్తున్నారు. సోమల సచివాలయంలో అపార్ నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి 3 నెలలు సెలవుపై వెళ్లడంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో నెల్లిమంద సచివాలయానికి అధికసంఖ్యలో తరలి వెళ్లారు. అక్కడ రోజుకు 12 మందికే అపార్ నమోదు చేస్తామని టోకన్లు మంజూరు చేయడంతో పడిగాపులు గాచి పలువురు ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీడీవో నారాయణకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ అన్వేషణకు కౌశల్ వేదిక కావాలి

కల్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తమ శాస్త్రీయ అన్వేషణకు కౌశల్ ప్రతిభా పోటీలు ఒక వేదిక కావాలని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. ఆ పాఠశాలలో సోమవారం కౌశల్ సైన్స్ రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ ప్రతిభ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతి విద్యార్థులు ఈ కౌశల్ పరీక్షల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. సైన్స్, గణితం, సాంఘికశాస్త్రంలోని వివిధ అంశాలపై ఆన్‌లైన్ ద్వారా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సైన్స్‌లో పరిశోధన చేపట్టేందుకు ప్రోత్సాహం కల్పిస్తారన్నారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్, సేంద్రియ వ్యవసాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, స్నేహమీలిని, వెంకటరమణారెడ్డి, సైదుల్లా, హనీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్ఫ్‌బోర్డు భూములను పరిశీలించిన కమిషనర్

పుంగనూరు రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పరసర ప్రాంతాలల్లోని వర్ఫ్‌బోర్డు భూములను వర్ఫ్‌బోర్డు కమిషనర్ ఝాన్సీరాణి సోమవారం పరిశీలించారు. పుంగనూరులో సర్వేనంబర్ 26, 43, మేలుపట్ల సర్వేనంబరు 26లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సమీపంలోని వర్ఫ్‌బోర్డు సంబంధించిన భూములను గుర్తించడానికి వచ్చినట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ రాము, డివిజన్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ శ్రీనివాసులునాయక్, వీఆర్వో సిద్దయ్య పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



దేవేంద్ర (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి సహాయం చేసినందుకు ఓ యువకుడు తన ప్రాణాలు తీసుకున్న ఘటన సోమవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు ...బోడేవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు దేవేంద్ర(26) స్వగ్రామానికి చెందిన తన స్నేహితులు చిన్నరమణ, విశ్వనాథ్, ప్రసాద్‌లు కలసి బెంగళూరులో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ప్రసాద్‌కు కారు ఉంది. పుంగనూరులోని బాష్యం పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న అగ్రహారానికి చెందిన చిరంజీవితో దేవేంద్రకు పరిచయం ఏర్పడింది. చిరంజీవికి అదే పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలుతో వివాహేతర సంబంధం ఉంది. చిరంజీవి పథకం ప్రకారం తన స్నేహితుడు దేవేంద్రను నమ్మించి ప్రసాద్ కారు తీసి ఇవ్వాలని, మదనపల్లెకు వెళ్లి వస్తామని చెప్పి ప్రసాద్ కారును తీసుకున్నాడు. ఉపాధ్యాయులు, చిరంజీవి కనిపించకపోవడంతో ఆమె అన్న అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దేవేంద్ర, చిన్నరమణ, విశ్వనాథ్, ప్రసాద్‌లను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి చిరంజీవి, ప్రీతిల ఆచూకీ తెలపాలని, సోమవారం ఉదయం స్టేషన్‌కు రావాలని చెప్పి పంపారు. అవమానంగా భావించిన దేవేంద్ర సోమవారం గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సీఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పుంగనూరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

బోయకొండ ఆలయ చైర్మన్‌గా దళితులకు అవకాశం కల్పించాలి

పుంగనూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని దళితులకు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం కట్టకిందపాళ్యంలో ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో దళితులకు న్యాయం చేయాల్సివుందన్నారు.

చిన్నారులకు పోటీలు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కుప్పం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు సొంత కథ రాయడంపై పోటీ నిర్వహించారు. అలాగే ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అంకెలను వెదకడం, వ్యాస రచన పోటీతో పాటు కుటుంబ సర్వే నిర్వహించారు. ఇదేరోజు సాయంత్రం ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీ జరిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సత్యవాణి మాట్లాడుతూ పిల్లలో చదువు పట్ల అవగాహన పెంచడంతోపాటు, పఠనాభిరుచిని పెంచడానికి, వివిధ అంశాలపై వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



పలమనేరు,నవంబరు18(ఆంధ్రజ్యోతి):పలమనేరు గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రయోజనాలపై వ్యాసరచన, జీకే, జాతీయ పక్షిపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు, ప్రశంసాపత్రాలు, బహుమతులను గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ అందజేశారు.

సారా స్వాధీనం

సోమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లెకు చెందిన జ్యోతి ఇంట్లోనే సారా విక్రయిస్తుండగా అమెను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర తెలిపారు. ఇంటి పరిసరాలో గాలించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సోమలలో ఇంటింటి సర్వే

సోమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో ఇంటింటి సర్వేను ఎంపీడీవో నారాయణ సోమవారం తనిఖీ చేశారు. ఉద్యోగులు ప్రతి ఇంటిని సందర్శించి గృహస్తుల వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే రైతుల పంట వివరాలను ఈకేవైసీ చేయాలన్నారు. ఇంటింటి సర్వే చేయని ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వికలాంగుడిపై దాడి



చికిత్స పొందుతున్న అశోక్

పుంగనూరు రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలో ఆదివారం ఓ వికలాంగుడిపై దాడి జరిగింది. మాగాండ్లపల్లె పంచాయతీ పెద్దబర్నేపల్లెకు చెందిన బాలాజీ కమతంపల్లెకు చెందిన రమేశ్‌లకు ఆర్థిక లావాదేవీలున్నాయి. ఆదివారం రాత్రి బాలాజీ అన్న అశోక్(వికలాంగుడు)తో కలసి కమతంపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్లి తనకు ఇవ్వాల్సిన డబ్బు గురించి రమేశ్‌ను అడిగారు. అక్కడే ఉన్న రమేశ్ స్నేహితుడు ప్రసాద్ కట్టితో అశోక్ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అశోక్‌ను బాలాజీ పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాడు.

కుక్కల దాడిలో 12మందికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 12మంది తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంకు చెందిన మూపేష్(3), యశ్వంత్(3), పత్తిమ్మగారిపల్లెకు చెందిన హర్షసాయి(5), మోతీనగర్‌కు చెందిన సీమా(4), ముబారక్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్‌బాషా, హాజుమ్(3), మహేశ్, నౌషాద్, అత్తావుల్లా, రాజీవ్‌గాంధీలపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గతనెలలో జరిగిన మున్సిపల్ సమావేశంలో పట్టణంలో కుక్కలు అధికంగా ఉన్నాయని నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరగా కమిషనర్ వారంలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతోనే కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- రామసముద్రం మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. పట్టణంలోని కట్టక్రిందపాళ్యంకు చెందిన గంగాధర్(40) ద్విచక్రవాహనంలో ఎన్ఎస్ పేటకు వెళుతుండగా ప్రసన్నయ్యగారిపల్లెకు చెందిన బాలకుమార్ ద్విచక్రవాహనంలో ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సలు అందించారు.

గ్రామగ్రామానా వెలుస్తున్న గోకులం షెడ్లు



గోకులం షెడ్‌లో సేదతీరుతున్న పాడి ఆవులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో గ్రామగ్రామానా గోకులం షెడ్లు వెలుస్తున్నాయి. అందులో సేదతీరుతున్న గోవులతో షెడ్లు కళకళలాడుతున్నాయి. కుప్పం పల్లెల్లో పాడిమీద ఆధారపడి జీవనం సాగించే పేద కుటుంబాలు అధికంగా ఉన్నాయి. పాడి రైతులు రోజూ పాలు పితికి డెయిరీలకు పోసి వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. అయితే వీరిలో చాలామంది పేదలు కావడంతో గోవుల సంరక్షణకోసం అనువైన పరిస్థితుల్లేవు. కనీసం వాటికోసం షెడ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత కూడా లేకుండా ఉంది. ఈ విషయం గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గోకులం షెడ్లను పేద రైతులకు నిర్మించి ఇవ్వాలని సంకల్పించారు. ఏకంగా 90 శాతం రాయితీతో ప్రభుత్వమే ఒక పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద పశు సంవర్థక శాఖ, డ్వామాలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధించి గోకులం షెడ్లను మంజూరు చేశారు. ఒక్క కుప్పం మండలానికే ఏకంగా 128 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అటు అధికారులతోపాటు ఇటు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ప్రజలను చైతన్యవంతులను చేసి గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందువల్ల 97 గోకులం షెడ్లు వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయి. 25 షెడ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. మొత్తం మండలంలోని 29 పంచాయతీల్లోనూ గోకులం షెడ్ల నిర్మాణం సాగుతోంది. గరిగచీనేపల్లె, మల్లానూరు, నూలుకుంట, ఎన్.కొత్తపల్లె తదితర ప్రాంతాల్లో కొన్ని నిర్మాణ దశలో ఉండగా, మరికొన్ని గోకులం షెడ్లను పూర్తి చేశారు. మండలంలోని గరిగచీనేపల్లెలో సోమవారం పూర్తయిన రెండు గోకులం షెడ్లను మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్లు పాడి పశువులకు, పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఎం ఇన్‌ఛార్జి జ్యోతి, అనిమల్ హజ్బెండ్రీ అధికారులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఏవీ.రవి, యూనిట్ ఇన్‌ఛార్జి చంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, బూత్ ఇన్‌ఛార్జిలు నరసింహులు, శశి, శక్తివేలు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు గోకులం షెడ్లు పూర్తి చేయాలి

సోమల,నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో మంజూరు చేసిన గోకులం షెడ్‌లను ఈనెలాఖరుకు పూర్తి చేయాలని ఎంపీడీవో నారాయణకు తెలిపారు. సోమవారం చిన్నఉప్పరపల్లె, నంజంపేట పంచాయతీల్లో నిర్మాణంలోని గోకులం షెడ్లను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మండలంలో 50 గోకులం షెడ్లు మంజూరు చేయగా 45 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఏపీవో దినకర్ బాబు, కార్యదర్శి ఓంప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక మార్గదర్శకుడు భక్త కనకదాస



మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్, పలమనేరు టీడీపీ కార్యాలయంలో కనకదాసుకు నివాళులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కురబ కుల దైవమైన కనకదాస సామాజిక మార్గదర్శకుడని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పంలోని కురబ కమ్యూనిటీ భవనం వద్ద సోమవారం కురబ కుల దైవం భక్త కనకాస జయంతి నిర్వహించారు. కనదాస విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నాయకులు సత్యేంద్రశేఖర్, చెక్కునత్తం మణి, కురబ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం కనకదాసు చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కురబ సంఘ నాయకులు సుబ్రమణ్యంగౌడు, సోమశేఖర్‌గౌడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ కార్యాలయంలో కురబ సంఘ నాయకులు కనకదాసు చిత్రపటానికి నివాళులర్పించారు.

బైరెడ్డిపల్లె: స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద కనకదాస చిత్రపటానికి పూజలు నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, కురబ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగభూషణం, నాయకులు గౌరప్పగౌడు, సుబ్రమణ్యంగౌడు, శంకరప్పగౌడు, శ్రీనివాసులు, శేషగౌడు, శివకుమార్, జనార్ధన్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారోత్సవం



చౌడేపల్లె మృత్యుంజయేశ్వరాలయంలో, రామకుప్పం కాశీవిశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలు - చిట్రెడ్డిపల్లెలో నోములు వ్రతాలు చేస్తున్న భక్తులు

చౌడేపల్లె,నవంబర్18(ఆంధ్రజ్యోతి): కేదారీశ్వర నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్తీక మాస మూడవ సోమవారం స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు కేదారీశ్వర వ్రత కథను వివరించి నోములు వ్రతాన్ని భక్తులచే అచరింప చేశారు. ఆలాగే చిట్రెడ్డిపల్లెలో రామాలయంలో భక్తులు నోములు ఆచరించగా మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల కట్టకింద సిద్ధలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కేదార గౌరీ నోములు నోచారు. పెద్దగొట్టిగల్లు ఓంకారేశ్వరస్వామి, మోటుమల్లెల పాలెంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు.

రామకుప్పం : రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి భక్తులు ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద గల నక్షత్ర, రాశి, నవగ్రహ వనంలో దేవతామూర్తులు, వృక్షాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

సోమల : సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ఉపవాసదీక్షలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కేదారేశ్వరి గౌరీ నోముల నోచుకునే భక్తులతో సందడిగా మారాయి. దుర్గంకొండ, ఇరికిపెంట నేలమల్లేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి ఆలయం, రెడ్డివారిపల్లె ఈశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలమనేరు : స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. సోమవారం రాత్రి స్థానిక లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో మహిళా భక్తులు పుష్పాలతో లింగాకృతిని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి అనంతరం శివనామస్మరణ పాటలు పాడారు.



సోమల శివాలయంలో పూజలు, రామకుప్పంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి



పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలంకరణలో లింగాకృతి

కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



పలమనేరు, నవంబరు 18 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన సుబ్రమణ్యం గౌడును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కురబ సంఘ నాయకులు సోమశేఖర్ గౌడు, బత్తిగౌడు, ఈశ్వరగౌడు, విశ్వనాథ్, చంద్రప్పగౌడు, సుబ్బుగౌడు, రామచంద్రగౌడు, శేషు, గంట్లప్ప, నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, టీడీపీ నాయకులు గిరిబాబు, బ్రహ్మయ్య, నాగరాజు, శ్రీధర్, కిరణ్, అమ్ములు, లోకేష్, సుబ్బు, వెంకటరమణ, మురళి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో...

రొంపిచెర్ల, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురబ కుల డైరెక్టరు ఉయ్యాల రమణకు సోమవారం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కాజూరి బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి గురజాల సందీప్‌నాయుడులు శాలువాలు కప్పి సత్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరిహరిబాబు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో 29 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట దాకా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి వివిధ సమస్యలపై మొత్తం 29 అర్జీలు పీడీకి అందాయి. ఇందులో రెవెన్యూ 7 అర్జీలు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 6, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 6, సివిల్ సప్లయ్ 3,ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, పోలీస్, సోషల్ వెల్ఫేర్, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించి రెండేసి అర్జీలు అధికారులకు అందాయి. అనంతరం కడా పీడీ అధికారులతో సమీక్షిస్తూ సీఎంవో ముఖ్యంగా ప్రజల నుంచి అందే అర్జీలపై ఎక్కువ దృష్టి పెట్టిందని, పెండింగులో పెట్టకుండా వచ్చిన అర్జీలు వచ్చినట్లుగా పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ ఏదైనా సమస్యను పరిష్కరించలేకపోతే, దానికి కచ్చితమైన కారణం పేర్కొనాలని సూచించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లోని ఖాళీ స్థల వేలం వాయిదా

పుంగనూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్టాండ్‌లోని మున్సిపల్ ఖాళీ స్థలాల వేలం పాట వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ ఆవరణలో వేలం పాట నిర్వహించగా ముగ్గురు వేలంపాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాళీ స్థలాలకు ఎక్కువ అద్దె చెల్లించాలని తెలపడంతో పాటదారులు వెనుతిరగడంతో వేలంపాటను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే తిరిగి వేలం పాట నిర్వహిస్తామన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి: ఏఎస్పీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్/కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆపరేషన్స్ ఏఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు అన్నారు. బాధ్యతలు స్వీకరించాక సోమవారం పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు కార్యాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఏ స్థాయిలోని సిబ్బంది అయినా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఏవో నాగభూషణమ్మ, ఏఏవో దస్తగిరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఏఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా జడ్జి బీమారావు, జేసీ విద్యాధరిలను కూడా కలిశారు.

'ఆర్బీఎస్‌కే స్ర్కీనింగ్' పకడ్బందీగా నిర్వహించాలి: కమిషనర్


సమావేశంలో ప్రసంగిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, నవంబరు 18: నగరపాలక పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు రాష్ట్రీయ బాలస్వస్థ స్ర్కీనింగ్ (ఆర్‌బీఎస్‌కే) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. స్ర్కీనింగ్ పరీక్షలపై ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ అవగాహన కల్పించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు


మీరాసాహెబ్ పాళెంలో సభ్యత్వాన్ని తీసుకున్న వారితో నేతలు

నగరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని మిట్టపాళెం, వీకేఆర్‌పురం, గుడ్డికండ్రిగ, మీరాసాహెబ్‌పాళెం తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మిట్టపాళెంలో కన్నెప్పరెడ్డి, గుడ్డికండ్రిగ, మీరాసాహెబ్‌పాళెంలో సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నగరి నియోజకవర్గాన్ని ముందుండేలా చూడాలన్నదే తమ లక్ష్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి తెలిపారు.

నగరిలో సహకార సంఘం వారోత్సవాలు


సహకార పతాకాన్ని ఎగురవేసిన అధికారులు

నగరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరి రూరల్ బ్యాంకులో సహకార సంఘం వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం పతాకాన్ని స్పెషల్ ఆఫీసర్ కుమార్ ఆవిష్కరించారు. నగరి సహకార కేంద్ర బ్యాంకు మేనేజరు కీర్తి సుధ, రూరల్‌బ్యాంకు సీఈవో తులసిపిళ్లై ప్రసంగించగా, అసిస్టెంట్ మేనేజర్లు ఆనంద్, వెంకటేశ్, సిబ్బంది శేఖర్, దుర్గాప్రసాద్, లేపాక్షి, కార్తీక్, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా గ్రామ చావడి



తవణంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చావడి భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. గతంలో ఇక్కడి నుంచే సర్పంచ్, వీఆర్వోలు అందుబాటులో ఉంటూ పాలన సాగించేవారు. అయితే పక్కా పంచాయతీ భవనం నిర్మాణంతో చావడి ఆలన, పాలన చూసేవారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు పరిసరాల్లో నివాసం ఉంటున్నవారు చెత్తాచెదారం చావడిలో వేస్తూ డంపింగ్ యార్డుగానూ మార్చారు. దీంతో గోడలు ఉప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉంది. దీనిపక్కనుంచే విద్యార్థులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి సోమవారం చావడి పక్కనే వారపు సంత కూడా నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం వానలు కురుస్తుండడంతో ఏ క్షణమైనా భవనం కూలే ప్రమాదముంది. ఇప్పటికైనా ఈ భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి మోక్షం

ఎమ్మెల్యే థామస్ చొరవతో నిధుల మంజూరుకు సీఎం గ్రీన్ సిగ్నల్


డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలం

వెదురుకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చొరవతో మోక్షం లభించింది. నిర్మాణానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రూ.17కోట్ల 82 లక్షల 50వేల మంజూరుకు ఆమోదం తెలిపారు. వైసీపీ పాలనలో 2020-21 విద్యా సంవత్సరంలో వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. తాత్కాలికంగా చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ తరగతులను ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జూనియర్ కళాశాల, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు డిగ్రీ కళాశాలను అరకొర వసతుల మధ్యే నెట్టుకొస్తున్నారు. కాగా, వైసీపీ పాలనలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి వెదురుకుప్పం మండలం కొమరగుంట రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనెంబరు-247/1,2,3,4,5,6,10లో ఎనిమిది ఎకరాల 44 సెంట్లు కేటాయించారు. అక్కడ భవన నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేసినట్లు కాగితాలకే పరిమితమైంది. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో పునాది రాయి పడలేదు కానీ వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో మాత్రం శ్రద్ధచూపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యే థామస్ చొరవతో కళాశాల భవన నిర్మాణ పనులు మొదలు కానున్నాయి.

ఈ వాహనాలను తొలగించండి



● రాఘవేంద్రస్వామి మఠం నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం వద్ద భక్తులకు అసౌకర్యంగా వాహనాలను ఉంచేశారు. వీటిని తొలగించాలని జిల్లా అధికారులను సోమవారం మఠం అధికారులు కోరారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ వాహనాల వల్ల మూడు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

బాబోయ్.. దోమలు, పాములు

ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల్లో ఆవాసం ● ఆందోళనలో స్థానికులు


మిట్టూరులోని రంగారెడ్డి వీధిలోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

చిత్తూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనేక ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలను అటు యజమానులు, ఇటు నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనివల్ల ఈ స్థలాల్లో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలు, పాములకు ఆవాసంగా మారాయి. ఆ తర్వాత పక్కనే ఉన్న ఇళ్లల్లోకి ఇవి వచ్చేస్తున్నాయి. ఈ ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖాళీ స్థలాలకు పన్ను వసూళ్లకు నగరపాలక సంస్థ అధికారులు చూపుతున్న శ్రద్ధ యజమానులకు నోటీసులు ఇచ్చి.. వాటిని శుభ్రం చేయించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత శనివారం రాత్రి కూడా మిట్టూరులోని రంగారెడ్డి వీధిలో పిల్లలు ఆడుకుంటుండగా పెద్ద పాము ఒకటి వచ్చింది. గమనించిన పిల్లలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగానే.. పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలోకి వెళ్లిపోయింది. తరచూ ఇలాగే జరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక దోమల బెడదతో తరచూ ఆస్పత్రుల పాలవుతున్నామని తెలిపారు. ఇకనైనా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

శివాలయాల్లో కార్తీక సోమవార పూజలు



కులందేశ్వర ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు - ఆవుదేవర నందీశ్వరుడికి పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో కార్తీక మాసం మూడో సోమవార పూజజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కట్టమంచి కులందేశ్వర ఆలయంలో అర్చకుడు సిద్ధూ స్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించగా.. భక్తులు దీపారాధనలు నిర్వహించారు. అలాగే నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర కాశీ విశ్వేశ్వర (రాజుగుడి), ఇరువారం నాగేంద్ర స్వామి, సంతపేట కనక దుర్గ, గిరింపేట దుర్గాంబ ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షిసమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, అభిషేక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వినాయక ఆలయంలో చండీయాగం



చిత్తూరు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గానగర్ కాలనీలోని సర్వసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం మహా చండీయాగం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాలాజి నాయుడు, సామాజికసేవకుడు పార్థసారథి నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వారోత్సవాలు ప్రారంభం


సత్యసాయి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం సత్యసాయి బాబా జయంతి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి అనుగ్రహ వ్రతం, సాయిలింగేశ్వర స్వామికి కార్తీకమాస సోమవార పూజలు చేశారు. బాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం కోరారు.

వైభవంగా ఆదిదంపతుల కల్యాణోత్సవం



పెనుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిగుండు శివాలయంలో సోమవారం ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా రామ్మూర్తిరెడ్డి, రాజేశ్వరి, అమర్‌నాథరెడ్డి, పార్వతి దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో మహిళలు దీపారాధనలు, పూజలు నిర్వహించారు.

దేశ భవిష్యత్తులో విద్యార్థుల పాత్ర కీలకం


సాహితీవేత్తలను సన్మానించిన లలిత

చిత్తూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తులో విద్యార్థుల పాత్ర కీలకమని రచయితల సంఘం అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహిత్య సదస్సును సోమవారం నిర్వహించారు. అనంతరం సాహితీవేత్తలను సన్మానించారు. విశ్రాంత అధ్యాపకుడు హరినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణ, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి


తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తి

బంగారుపాళ్యం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి.. తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దండువారిపల్లె గ్రామానికి చెందిన కృష్ణమూర్తి.. టీడీపీలో చురుకైన కార్యకర్తగా కొనసాగుతూ జంబువారిపల్లె పంచాయతీలో వాటర్ సప్లయ్ మ్యాన్‌గా ఉన్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై దాడిచేసి, తీవ్రంగా కొట్టి కొత్తపల్లె ఫ్లైఓవర్ సమీపంలోని ఓ మామిడి తోటలో పడేశారు. తీవ్రంగా గాయపడటంతో స్పృహ కోల్పోయిన ఆయన్ను సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. బాధితుడిని సీఎంసీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే వైద్య ఖర్చులకు కూడా డబ్బుల్లేవని పార్టీ తరపున ఆదుకోవాలని కృష్ణమూర్తి భార్య వేడుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.



ఆటో ఢీకొని వ్యక్తి మృతి

పూతలపట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కొండకిందపల్లె గ్రామానికి చెందిన మనోహర్ నాయుడు పని నిమిత్తం పాటూరు గ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి


కె.కొత్తూరు వద్ద బ్రిడ్జికి ఏర్పడిన రంధ్రం

యాదమరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదమరి - గుడియాత్తం రహదారిలోని కె.కొత్తూరు వద్ద ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. రేపో మాపో కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. రహదారి విస్తరణ, మరమ్మతులు చేపట్టకపోవడంతో బ్రిడ్జిలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ బ్రిడ్జిపై పెద్ద రంధ్రం ఏర్పడటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి పరదరామి తనిఖీ కేంద్రం వరకు దాదాపు రెండు పెద్ద బ్రిడ్జిలు ఉండగా, మరో 10 వరకు చిన్నవి ఉన్నాయి. ఈ రహదారిపై మండల కేంద్రంలో ఉన్న రెండు భారీ సైజు బ్రిడ్జిలు, కె.కొత్తూరు గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి నిర్వహణ లేకపోవడంతో వర్షాలకు దెబ్బతిని భారీ సైజులో గుంతలు ఏర్పడి.. కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనుమూరు/వెదురుకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు సోమవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పి.సుబ్రమణ్యం, హెచ్ఎం వెంకటేశ్వరనాయుడు, టీచర్లు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, గ్రంథాలయం ఆవశ్యకతపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను గ్రంథాలయాధికారి వి.మునిరాజ నిర్వహించారు.

బాధితురాలికి పరామర్శ

పెనుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపెంట సెక్రటరీ నాగభూషణం ఆదివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాణిపేటలోని సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలిని సోమవారం ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అయ్యప్ప, సెక్రటరీలు ప్రభుకిరణ్, శ్రీనివాసులు పరామర్శించారు. వైద్యం కోసం తమ వంతు సాయం అందజేస్తామని కుటుంబీకులకు చెప్పారు.

ముగిసిన రేషన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నవంబరు నెలకు సంబంధించి నిత్యావసర వస్తువుల పంపిణీ ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. 5,43,202 బియ్యం కార్డులకుగాను 88.98శాతం (4,97,247 కార్డులకు) సరుకులను రేషన్ డీలర్లు పంపిణీ చేశారు. పోర్టబిలిటీ ద్వారా ఇతర ప్రాంతాలకు చెందిన 97,997 మంది రేషన్ పొందినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

యాదమరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న గోకులం షెడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల పనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి ఏపీడీ మల్లికార్జున్ సూచించారు. సోమవారం ఆయన పలు పంచాయతీల్లో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో బాల, టీఏ దేవరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ మోనిస్ అన్నారు. ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా సోమవారం క్యాడెట్లు మొక్కలు నాటారు. ఏవో మేజర్ లోకనాథ్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్ రెడ్డి, బాలాజి, యుగంధర్, కార్తీక్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై దృష్టి పెట్టండి: తహసీల్దార్

యాదమరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ పార్థసారధి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. స్థానికంగా, జిల్లా సచివాలయం ద్వారా అందే ఫిర్యాదులను వారంలోనే పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. డీటీ జయంతి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు సురేష్, వేలాయుధం, సురేష్ బాబు పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణ పూజలు



వెదురుకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో సోమవారం మహా సంప్రోక్షణ పూజలు చేశారు. ఈ క్రమంలో గణపతి పూజ, హోమం తదితరాలను నిర్వహించారు. భక్తులకు దర్శన వసతి కల్పించి తీర్థప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.


సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు

గుట్ట ప్రాంత స్థలాల విక్రయాలపై విచారణ చేయాలి

● స్థానికుల డిమాండ్



గుట్టపై నిర్మాణాలు (ఇన్‌సెట్లో) గుట్టను చదును చేసిన దృశ్యం

చిత్తూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం 49వ డివిజన్ పాంచాలిపురం రెవెన్యూలో 316 సర్వే నెంబరులో ఉన్న గుట్ట ప్రాంతాన్ని పట్టాలిచ్చి విక్రయించిన వారిపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పాంచాలిపురం, సమీపాల్లో ఉన్న వారంతా ఈ గుట్టను మేతభూమిగా వాడుకునేవారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ నేత అధికార బలంతో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ గుట్టలో ఒక్కో పట్టాను రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అమ్ముకున్నాడు. మామూలుగా అయితే ప్రభుత్వం పేదలకిచ్చే స్థలాల్లో ఒక్కో లబ్ధిదారుడికి ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని ఇస్తారు. అయితే ఇక్కడ మాత్రం మూడు, నాలుగు, ఐదు సెంట్ల వరకు ఇండ్ల స్థలాలను రాసిచ్చారు. పట్టాలను తీసుకున్న 30 మంది ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తే బయటకు తెలిసిపోతుందని అప్పట్లో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం నిర్మాణాలను ప్రారంభించారు. దీనిపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి: ఈఈ

పెనుమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో పెండింగ్‌లో ఉన్నవి త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ ఈఈ గోపాల్‌నాయక్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో గత ప్రభుత్వంలో 1,726 ఇళ్లు మంజూరు చేస్తే 1,192 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ రాఘవయ్య, ఇన్‌చార్జి ఏఈ పృథ్వి, హౌసింగ్ అధికారులు చరణ్, కనకరాజు పాల్గొన్నారు.